VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

మంగళవారం 09 ఏప్రిల్ 2024

సంపుటి.01 సంచిక.238



ఉగాది శుభాకాంక్షలు



2 లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరో షాక్

మధ్యంతర బెయిల్ తిరస్కరించిన కోర్టు




2 లో

## బిఆర్ఎస్‌కు గట్టి అభ్యర్థులు కరువు

వరంగల్ ఎంపి అభ్యర్థి ఎంపిక

హ్యాండిచ్చిన ఎంపిక చేసిన ఇద్దరు అభ్యర్థులు

తాటికొండ రాజయ్యకే టిక్కెట్ దక్కే ఛాన్స్



2 లో

## కెసిఆర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం

13 నుంచి జిల్లాల్లో బస్సుయాత్ర

చేవెళ్ల నుంచి ప్రచారం ప్రారంభం




# కొడంగల్‌లో మెజార్టీ తగ్గించేందుకు భాజపా, భారాస కుట్ర


కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మెజార్టీని తగ్గించేందుకు భాజపా, భారాసలు కలిసి కుట్ర పన్నుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

కాంగ్రెస్‌పై కొంతమంది కక్షగట్టి దుష్ప్రచారం చేస్తున్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**కొడంగల్:** కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మెజార్టీని తగ్గించేందుకు భాజపా, భారాసలు కలిసి కుట్ర పన్నుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కొంతమంది కక్షగట్టి కాంగ్రెస్‌ను పడేయాలని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో సీఎం మాట్లాడారు. పదేళ్లపాటు ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ ఈ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ ఓటేస్తే చంద్రమండలానికి రాజవుతారా అని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. కేంద్రం నుంచి అధిక నిధులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. మట్టి పని, బొగ్గు పని కోసం ఈ ప్రాంత ప్రజలు ముంబయి, పుణెలకు వలస వెళ్తోంటే వాటిని రెండుసార్లు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన కేసీఆర్ నివారించలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. అయినా ఒక్క ఎకరానికీ సాగునీరు అందించలేదన్నారు. ఈ ప్రాంత ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు చెన్నారెడ్డి తలపెట్టిన తెలంగాణ ఉద్యమంలో చీమలు, పాముల్లా చొరబడిన కొందరు.. తెలంగాణను పట్టిపీడించారని ఆరోపించారు. భారాస నేతలను గత ఎన్నికల్లో ప్రజలు చీదరించుకున్నా.. మరోమారు వారి ముందుకురావడం సిగ్గుచేటన్నారు. మహబూబ్‌నగర్‌కు ఏం చేశారని కేటీఆర్ పర్యటిస్తారని ప్రశ్నించారు. భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఎస్ఎల్‌బీసీ, దేవాదుల, ప్రాణహిత పూర్తి చేశారా అని ప్రశ్నించారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతలతో మహర్దశ కొడంగల్ నియోజకవర్గానికి మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్, వెటర్నరీ, మహిళా డిగ్రీ కళాశాలలు తెచ్చుకున్నామని రేవంత్ తెలిపారు. రూ.వందల కోట్లతో తండాలకు రోడ్లు తెచ్చుకుంటున్నామని ఆయన వివరించారు. కరవుతో అల్లాడుతున్న ఈ ప్రాంతానికి నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలతో మహర్దశ రానుందని చెప్పారు. నాటి కాంగ్రెస్ హయాంలో డి.కె.అరుణ అనేక పదవులు చేపట్టారని.. కార్యకర్తలను మోసం చేసి వేరే పార్టీలోకి వెళ్లారన్నారు. పాలమూరు జిల్లాకు ఆమె చేసిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి కొడంగల్‌లో 50 వేల మెజార్టీ వచ్చేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు సంపత్, పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## యువకుడి దారుణ హత్య హత్యకు ప్రతీకారమంటూ ఇన్‌స్టాలో పోస్ట్



**హైదరాబాద్:** పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన హైదరాబాద్‌లోని బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి ప్రగతినగర్‌లో జరిగింది. ఎస్ఆర్ నగర్‌లోని దాసారం బస్తీకి చెందిన తేజస్ (21) అలియాస్ సిద్ధూ.. గత ఏడాది స్థానికంగా జరిగిన ఓ హత్య కేసులో ఏ3 నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసులో జైలుకు వెళ్లి రెండు నెలల క్రితం విడుదలయ్యాడు. ప్రస్తుతం ప్రగతినగర్‌లోని అద్దె ఇంట్లో తన తల్లితో కలిసి నివాసముంటున్నాడు. ఆదివారం రాత్రి సిద్ధూ తల్లి ఊరు వెళ్లింది. దీంతో ఒంటరిగా ఉన్న తేజస్.. తన మిత్రులైన మహేశ్, శివప్ప, సమీర్‌తో కలిసి మద్యం తాగాడు. సోమవారం తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో ప్రగతినగర్‌లోని బతుకమ్మ ఘాట్ ఎదురుగా నిలబడి ఉండగా.. గతంలో హత్యకు గురైన తరుణ్ స్నేహితులు సుమారు 20 మంది ద్విచక్రవాహనాలపై వచ్చి తేజస్‌ను కత్తులతో పొడిచి చంపారు. హత్య తర్వాత నిందితులు సెల్ఫీ వీడియో ద్వారా చిత్రీకరించి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. తరుణ్ హత్యకు ప్రతీకారంగా తమ పగ నెరవేర్చుకున్నామంటూ నిందితులు ఆ పోస్టులో పేర్కొనడం గమనార్హం. ఘటనాస్థలిని కూకట్‌పల్లి ఏసీపీ కె.శ్రీనివాసరావు, బాచుపల్లి సీఐ జె.ఉపేందర్‌యాదవ్ పరిశీలించారు. ఘటనకు బాధ్యులుగా భావిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## తెలుగురాష్ట్రాల్లో అల్లాడుతున్న జనం



**హైదరాబాద్:** లపై సూరీడు నిప్పులు కురిపిస్తున్నట్టే ఉంది తెలుగురాష్ట్రాల్లో పరిస్థితి. భగభగ మండుతున్న ఎండలు మాడు మంటెక్కిస్తున్నాయి. ఉదయం 9 గంటలకే సూరీడు నిప్పులు చిమ్ముతుండటంతో జనం అల్లాడుతున్నారు. చాలాచోట్ల 40 డిగ్రీల టెంపరేచర్లు దాటిపోతున్నాయి. మరోవైపు వేడిగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. బయటకు వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. ఉదయం ఎండ తీవ్రతతో వేర్వేరు పనులపై వెళ్లే వాళ్లంతా ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలు దాటితే ప్రధాన రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. జాతీయ రహదారి సైతం వాహనాలు రాకపోకలు లేక ఖాళీగా కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. సాధారణంగా ఏప్రిల్‌లో 40 డిగ్రీలలోపే ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. కానీ ఇప్పుడు 40 డిగ్రీల టెంపరేచర్లు క్రాస్ అవుతున్నాయి. మే నెల అప్పుడే వచ్చేసిందా అన్నట్టుగా సూరీడు నిప్పులు చిమ్ముతున్నాడు. ఇప్పుడే ఎండ మంట ఇలా ఉంటే.. మేలో సిట్యువేషన్ ఏంటి? రోకలి బండలు పగలడం ఖాయమేనా అన్న అనుమానాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎండే కదా అని అశ్రద్ధ చేస్తే వడదెబ్బ బారినపడటం ఖాయం. బయటకెళ్లే సమయంలో గొడుగు, టోపీ లాంటివి రక్షణగా తీసుకెళ్లాలి. వీలైనంత వరకు తెలుపు రంగు దుస్తులు ధరిస్తే ఎండ బారి నుంచి కాపాడుకోవచ్చు. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు సమీపంలో ఉండే దుకాణాల దగ్గరకు వెళ్లి చల్లదనం ఎక్కువగా ఉండే శీతల పానీయం తాగేందుకు ప్రయత్నించకూడదు.

## వచ్చేది మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమే...

**హైదరాబాద్,:** కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని రోజులు ఉంటుందో తెలియదన్నారు. సోమవారం సిద్దిపేటలో జరిగిన మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఐదు సంవత్సరాలకు మించి అధికారంలో ఉన్న రాష్ట్రాలు చాలా తక్కువ అని గుర్తు చేశారు. కొన్ని రాష్ట్రాల్లో సెల్ఫ్ గోల్స్‌తో ఐదు సంవత్సరాల కంటే ముందే అధికారం కోల్పోయిందని చెప్పారు. తెలంగాణ మళ్లీ అధికారంలోకి వచ్చేది మేమేనని స్పష్టం చేశారు. హరీశ్ రావు వ్యాఖ్యలు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారాయి. ఓ వైపు కాంగ్రెస్‌లోని సీనియర్ నేతలు, కొంత మంది మంత్రులు సీఎం రేవంత్ రెడ్డిపైతీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డిని నమ్మడం లేదని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. అందుకు ప్రధాని మోదీని కలిసినప్పుడు సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉండటమే ఇందుకు నిదర్శనమని ఉదహరిస్తున్నారు. అనిశ్చితికి మారు పేరైనా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలో ఉంటుందో.. ప్రభుత్వం ఎప్పుడు పడిపోతుందో తెలియక దినదిన గడం నూరేళ్ల ఆయుష్షు లాగా పాలన సాగిస్తున్నది. ఇలాంటి తరుణంలో హరీశ్ రావు వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



# బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరో షాక్

**మధ్యంతర బెయిల్ తిరస్కరించిన కోర్టు**

**న్యూఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరో షాక్ తగిలింది. తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను రౌస్ అవెన్యూ తిరస్కరించింది. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్ ను కొట్టేసింది. చిన్న కుమారుడికి పరీక్షలు ఉన్నందున ఈ నెల 16 వరకూ మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఏప్రిల్ 4న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా, బెయిల్ పిటిషన్ కొట్టేస్తున్నట్లు తీర్పు ఇచ్చింది. సీబీఐ స్పెషల్ కోర్ట్ జడ్జి కావేరి భవేజా కవితకు బెయిల్ నిరాకరిస్తూ తీర్పును వెలువరించారు. ఏప్రిల్ 4న కవిత బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం.. మహిళగా, ఎమ్మెల్సీగా ఉన్నందున.. ముఖ్యంగా తన చిన్న కుమారుడుకి 11వ తరగతి పరీక్షలు ఉన్నందున ఏప్రిల్ 16 వరకూ మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత కోరారు. ఈ మధ్యంతర బెయిల్‌ను ఈడీ వ్యతిరేకించింది. అయితే కవిత చిన్నకొడుకు ఒంటరిగా ఏం లేడు. 22 ఏళ్ల సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులు తోడుగా ఉన్నాడు. కవితను ఆమె ముగ్గురు సిస్టర్స్ ములాఖత్ అయ్యారు. అబ్బాయి చూసుకోవాడానికి కుటుంబ సభ్యులు ఉన్నారు. పరీక్షలు ఉన్నాయని మధ్యంతర బెయిల్ అడుగుతున్నారు, కానీ పరీక్షల్లో కొన్ని ఇప్పటికే అయిపోయాయి. కవిత కుమారుడికి ఎగ్జామ్ యాం÷-జగైటీ ఉందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదు అని ఈడీ తరపు న్యాయవాది తెలిపారు. కవితకు వ్యతిరేకంగా ఆధారాలు ఉన్నాయి. లిక్కర్ కేసు ఎ÷-లాన్ చేసింది కవిత. కవిత మొబైల్ ఫోన్లను మార్చారు. ఆధారాలు ధ్వంసం చేశారు. ఫోన్లలో సమాచారాన్ని డిలీట్ చేశారు. 9 ఫోన్లలో డేటా డిలీట్ చేశారు. మొత్తం 10 ఫోన్లను ఫోరెన్సిక్ లాబ్‌కు పంపాం. 9 ఫోన్లను ఫార్మాట్ చేశారు. లిక్కర్ కేసులో కవిత పాత్రపై దర్యాప్తు కొనసాగు తుంది. కవిత బ్యాంకు ఖాతాలు, ఐటీఆర్ వివరాలు,కుటుంబ వ్యాపార వివరాలు ఇవ్వలేదు. ఫోరెన్సిక్ లాబ్ డేటా ప్రకారం 4 ఫోన్లు ఫార్మాట్ చేయబడ్డాయి. ఈ కేసులో వందల కొద్దీ డిజిటల్ పరికరాల్లో డేటా డిలీట్ చేయబడింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉంది.. ఈ సమయంలో కవితకు బెయిల్ ఇవ్వడం కేసు దర్యాప్తుకు ఆటంకం కలుగుతుంది. లిక్కర్ వ్యాపారంలో కవిత వాటా 33 శాతం. మాగుంట రాఘవరెడ్డి వాటా 33 శాతం. దినేష్ అరోరా అప్రూవర్ మారాకా అన్ని విషయాలు చెప్పాడు. వంద కోట్ల రూపాయలు కవిత ఆలోచన మేరకే ఆమ్ ఆద్మీ పార్టీకి ముడుపుల రూపంలో ఇచ్చారు. బుచ్చిబాబు ఫోన్ నుంచి డేటా రికవరీ చేశాము. ఆ డేటా ఆధారంగా కవితను విచారించాము. అరుణ్ పిళ్ళైతో కవితను విచారించాము. అప్రూవల్‌గా మారిన వ్యక్తిని తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవద్దంటూ కవిత బెదిరించారు‘ అని న్యాయవాది జోయబ్ హోస్సేన్ వెల్లడించారు. కవితకు వ్యతిరేకంగా సేకరించిన ఆధారాలను జడ్జికి సమర్పించారు. అలాగే కవితకు బెయిల్ ఇవ్వాలన్న వాదనను తిరస్కరించాలని కోర్టును ఈడీ తరపు న్యాయవాది జోయబ్ హోస్సేన్ కోరారు. ఈడీ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం కవితకు బెయిల్‌ను నిరాకరించింది.

# కెసిఆర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం

**హైదరాబాద్**: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 13 నుంచి ఆయన ప్రజల్లోకి రానున్నారు. ఆ రోజు చేవెళ్ల బహిరంగ సభలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. బహిరంగ సభల కంటే బస్సు యాత్రల వైపే గులాబీ బాస్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గానికి బస్సు యాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ పాల్గొననున్నట్లు సమాచారం. చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచే బస్సు యాత్ర ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నెల 13న కేసీఆర్ చేవెళ్లలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎండిన పంటలను పరిశీలించాలని కేసీఆర్ ఇటీవల పొలంబాట పట్టారు. అందులో భాగంగా ఈ నెల 5న కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. పలు నియోజకవర్గాల్లో ఎండిన పంటలు పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. రైతులు ధైర్యంగా ఉండాలని.. బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పలువురు రైతులు ఆయనకు సమస్యలు ఏకరువు పెట్టారు. సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గులాబీ బాస్ దృష్టికి తెచ్చారు. మంచినీళ్లకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కొందరు చెప్పారు. దీనిపై స్పందించిన కేసీఆర్.. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు జనగామసూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించారు. తెలంగాణలో అన్నదాతలు మళ్లీ ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వస్తుందని అనుకోలేదని.. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో అంతా ఆలోచించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. పంటలు పరిశీలించిన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'కాంగ్రెస్ 100 రోజుల పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్న తెలంగాణకు స్వల్ప కాలంలోనే ఈ దుస్థితి ఎందుకు రావాలి.?. సాగునీళ్లు ఇస్తారని నమ్మి రైతులు పంటలు వేసుకున్నారని.. ముందే చెబితే వేసుకునే వాళ్లం కాదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఇంత కష్టకాలం వస్తుందని నేను ఎప్పుడూ అనుకోలేదు.’ అని కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

# రేవంత్ ఇంటి సమీపంలోనే డెన్



**హైదరాబాద్:** రాష్ట్రంలోనే సంచలనం కలిగించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. విచారణలో లోతుగా వెళ్లే కొద్దీ సంచలన విషయాలు బయటకొస్తున్నాయి. జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి సమీపంలోని ఓ గెస్ట్ హౌస్ లో సోమవారం ఉదయం పోలీసులు సోదాలు నిర్వహించారు. ఇది ఓ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ నవీన్ రావుదిగా తెలుస్తోంది. ప్రతిపక్ష నేతల ఫోన్ ట్యాపింగ్ కోసం ఈ గెస్ట్ హౌస్ నే ప్రణీత్ రావు బృందం డెన్ గా మార్చుకుని ఉంటుందని దర్యాప్తు బృందం భావిస్తోంది. సీఎం రేవంత్ ఇంటికి కూతవేటు దూరంలో ఉండడంతోనే తమ పని అక్కడి నుంచే సులువు అవుతుందని ఆ టీం భావించినట్లు చెబుతున్నారు.

ఈ గెస్ట్ హౌస్ నుంచే అడిషనల్ ఎస్పీ భుజంగరావు ట్యాపింగ్ ఆపరేషన్ నిర్వహించినట్లు సమాచారం. నిందితులు విచారణలో వెల్లడించిన సమాచారం మేరకే పోలీసులు ఇప్పుడు గెస్ట్ హౌస్ లో సోదాలు నిర్వహించారు. ఫోన్ ట్యాపింగ్ ఆపరేషన్ కు పొలిటికల్ ఇంటెలిజెన్స్ ఆఫీస్ కంటే నవీన్ రావు గెస్ట్ హౌస్ మేలని.. ఇక్కడే మీటింగ్ పెట్టి తతంగం అంతా నడిపినట్లు దర్యాప్తులో నిందితులు వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి త్వరలో నవీన్ రావును దర్యాప్తు బృందం పిలిచి విచారించనున్నట్లు సమాచారం. అటు, ఈ వ్యవహారం నల్గొండ జిల్లాలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది. జిల్లాకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను సైతం ఈ కేసులో అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా డబ్బు పంపిణీతో పాటు వ్యాపారుల ఫోన్లు ట్యాప్ చేశారనే ఆరోపణలున్నాయి. దీనిపైనా దర్యాప్తు బృందం విచారిస్తోంది. అయితే, ఫోన్ ట్యాపింగ్ కు వినియోగించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని హైదరాబాద్ నుంచే సమకూర్చుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. మాదాపూర్ లోని ఓ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇందుకు సంబంధించి టెక్నలాజికల్ టూల్ ను అందించే కన్సల్టెన్సీగా వ్యవహరించినట్లు తేలింది. టెలీ కమ్యూనికేషన్ రంగంలో అపార అనుభవం ఉన్న ఆ కంపెనీ ద్వారానే సాఫ్ట్ వేర్ ను సమకూర్చుకున్న ప్రణీత్ బృందం.. దీన్ని అక్రమ వ్యవహారాలకు వినియోగించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఎస్ఐబీలోనే రెండు ప్రత్యేక గదులు ట్యాపింగ్ వ్యవహారానికి కేంద్రంగా ఉన్నాయని.. బయటి ప్రాంతాల్లో సర్వర్లు పెట్టి నిఘా ఉంచలేదని ఇప్పటివరకూ జరిగిన దర్యాప్తులో తేలింది. అసెంబ్లీ ఎన్నికల పక్రియ పూర్తి కాగానే ఫోన్ ట్యాపింగ్ నిలిపేసినట్లు దర్యాప్తులో తేలింది. ఎస్ఐబీలో 17 కంప్యూటర్లలోని 42 హార్డ్ డిస్క్ లను తీసేసి.. వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చారని తెలుస్తోంది. ఈ కారణంగా మావోయిస్టులకు సంబంధించిన సమాచారం కూడా లేకుండా పోయిందని సమాచారం. పోలీస్ విచారణలో ప్రణీత్ రావు ఇచ్చిన సమాచారం ఆధారంగానే మూసీ నదిలో నాలుగో బ్రిడ్జి కింద హార్డ్ డిస్క్ శకలాలను స్వాధీనం చేసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సీరియస్ గా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మొదట మాజీ పోలీస్ అధికారి ప్రణీత్ రావు ను అరెస్ట్ చేసింది. విచారణలో ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగా అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతల ఫోన్లతో పాటు ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా నేతల ఫోన్లు ట్యాప్ చేసి వారి ఎన్నికల సంబంధిత, వ్యక్తిగత విషయాలపై నిఘా పెట్టారని అభియోగాలున్నాయి. తెలంగాణలో ప్రభుత్వం మారిన సమయంలో ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ ఆడియో రికార్డు చేసిన హార్డ్ డిస్క్ లను ధ్వంసం చేశారని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో మార్చి 28న టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావును పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

# బిఆర్ఎస్‌కు గట్టి అభ్యర్థులు కరువు

**వరంగల్:** వరంగల్ బిఆర్ఎస్ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేయాలన్న విషయంలో బిఆర్ఎస్ మల్లగుల్లాలు పడుతోంది. సరైన అభ్యర్థిని ఎంపిక చేయలేక తంటాలు పడుతోంది. ఎంపిక చేసిన కడియం కావ్య జంప్ చేశారు. ఎంపిక చేద్దామనుకున్న ఆరూరి రమేశ్ బిజెపిలో చేరారు. దీంతో ఇప్పుడు అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ నియోజకవర్గం కావడంతో కష్టంగా మారింది. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీలోని కీలకమైన నేతలు కాంగ్రెస్, బీజేపీల్లోకి వెళ్లారు. ఇక్కడి నుంచి బలమైన అభ్యర్థిని బరిలో దించాలనే ఆలోచనలో అధిష్ఠానం ఉంది. అయితే నాయకులు పోయినంత మాత్రనా కేడర్ వెళ్లదని గులాబీ నేతలు నమ్ముతున్నారు. దీంతో పాటు కడియం శ్రీహరి ఎపిసోడ్‌ను ఎన్నికల అస్త్రంగా మల్చుకుని ఓట్ల వేటలో దిగాలనే ఆలోచనలో గులాబీ నేతలు ఉన్నారు. 1వ తేదీన వరంగల్ పర్యటనకు వచ్చిన హరీశ్‌రావు ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో అభ్యర్థి ఎంపికపై చర్చించారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి, వరంగల్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న పేరును కొంతమంది నేతలు హరీశ్‌రావు దృష్టికెళ్లారు. అయితే జనగామ ఎమ్మెల్యేతో పాటు మరికొందరు నేతలు మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యను పోటీలో దించేతే గట్టి పోటీ ఉంటుందని సూచించారు. వీరితో పాటు తెలంగాణ ఉద్యమకారులైన జోరుక రమేశ్, బోడ డిన్నా, సిరిమిల్ల సదానందం, నిరంజన్ తదితరులు కూడా టికెట్ ఆశిస్తున్నారని హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఉద్యమకారులకు భవిష్యత్తు మంచి అవకాశాలు కల్పిస్తామని, ఈసారి వరంగల్ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకుంటున్నామన్నారు. అంగ బలంతో పాటు ఆర్థికంగా బలమైన నేతను బరిలో దించాలని అధిష్ఠానం ఆలోచనగా హరీశ్‌రావు చెప్పినట్లు సమాచారం.మరోవైపు మాజీ సీఎం కేసీఆర్ సైతం వరంగల్‌పై ఫోకస్ చేశారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలతో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. టికెట్ విషయంపై చర్చించినట్లుగా తెలిసింది. అయితే స్థానికేతరులైన మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, బాల్క సుమన్‌లు కూడా వరంగల్ టికెట్ అడుగుతున్నట్లుగా సమాచారం. అయితే వరంగల్ స్థానం నుంచి పోటీ చేసిన స్థానికేతరులు ఇప్పటి వరకు ఎవరు గెలువలేదని, స్థానికులకే టికెట్ ఇవ్వాలని వరంగల్ జిల్లా ప్రతినిధులు కేసీఆర్‌ను కోరినట్లుగా సమాచారం. దీంతో ఒకటి రెండు రోజుల్లో వరంగల్ అభ్యర్థిని ఖరారు చేస్తామని కేసీఆర్ నేతలకు హామీ ఇచ్చినట్లుగా తెలిసింది. పెద్ది స్వప్న లేదంటే తాటికొండ రాజయ్యలల్లో ఒకరికి టికెట్ పక్కా అనే చర్చ గులాబీ పార్టీ నేతల నుంచి వినిపిస్తోంది. అయితే తెలంగాణ ఉద్యమకారులల్లో బోడా డిన్నా టికెట్ కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. మాదిగ సామాజిక వర్గం నేతకే టికెట్ ఇవ్వాలని పార్టీ భావిస్తే రాజయ్య కాదంటే డిన్నా పేరును పరిశీలించే అవకాశం ఉంది. మొత్తానికి కాంగ్రెస్, బీజేపీలకు దీటుగా అభ్యర్థిని బరిలో దించాలనే ఆలోచనలో బీఆర్ఎస్ ఉంది. దీంతో ఓరుగల్లు పోరు రసవత్తరంగా మారుతుంది.వరంగల్ లోక్‌సభ సీటుపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఇక్కడ పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఇప్పటికే కడియం కావ్యను కాంగ్రెస్ బరిలోకి దించగా, బీజేపీ నుంచి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ పోటీ చేస్తున్నారు. ఈ ఇద్దరు నేతలు కూడా గులాబీ పార్టీ నుంచి వలస వచ్చిన వారే. ఈ నేపథ్యంలో కారు పార్టీకి అభ్యర్థి కరువయ్యారు. కడియం కావ్యను తమ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత ఆమె రాజీనామా చేసి కాంగ్రె?సలో చేరి ఆ పార్టీ నుంచి పోటీకి దిగుతున్నారు. దీంతో గులాబీ పార్టీ ఈ స్థానాన్ని సవాల్‌గా తీసుకుంది. బలమైన అభ్యర్థిని బరిలో దించేందుకు కసరత్తు చేస్తోంది. మరోవైపు బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు నిత్యం ప్రజల్లోకి వెళ్తూ ప్రచారంలో మునిగిపోయారు.

2009లో పునర్వ్యభజనలో భాగంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో వరంగల్ పార్లమెంట్ ఏర్పడింది. వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి, పరకాల, వర్ధన్నపేట, స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి నియోజకవర్గాలతో ఈ స్థానం ఎస్సీ రిజర్వుడుగా ఏర్పడింది. 2009లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సిరిసిల్ల రాజయ్య విజయం సాధించారు. ఆ తర్వాత 2014లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కడియం శ్రీహరి విజయం సాధించారు. 2015లో శ్రీహరి ఎంపీ స్థానానికి రాజీనామా చేసి, ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే 2016లో జరిగిన ఉప ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పసునూరి దయాకర్ విజయం సాధించారు. 2019 ఎన్నికల్లోనూ దయాకర్ కారు గుర్తుపై మరోసారి విజయం సాధించారు. 2009 నుంచి 2019 వరకు నాలుగుసార్లు ఎన్నికలు జరిగితే మూడు పర్యాయాలు కారు పార్టీ విజయం సాధించింది. వరంగల్‌లో తెలంగాణ ఉద్యమం బలంగా ఉండటం ఆ పార్టీకి కలిసి వచ్చింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సైతం ఇటీవల కాంగ్రెస్‌లో చేరడంతో పాటు ఆయన కుమార్తెకే టికెట్ కేటాయించడంతో గులాబీ కోటకు బీటలు వారుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. వరంగల్ ఎంపీ స్థానాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌ను పార్టీలో చేర్చుకుని బీజేపీ ఆయనకు టికెట్ ఇచ్చింది. అంగ బలంతో పాటు ఆర్థికంగా బలమైన నేత కావడంతో బీజేపీ ఆరూరిని ఆకర్షించింది. దీనికి తోడు వరంగల్ పార్లమెంట్ పరిధిలో బలమైన మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం.. తమకు కలిసి వస్తుందనే ఆశతో కమలనాథులు ఉన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకాధ్యక్షులు మంద కృష్ణమాదిగ సొంత జిల్లా కావడంతో ఆయన కూడా బీజేపీ గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ అభ్యర్థిగా ఖరారైన రమేశ్ బీజేపీ కీలక నేతలను మర్యాదపూర్వకంగా కలవడంతో పాటు నియోజకవర్గా స్థాయి కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రచారంలో మిగతా పార్టీలకంటే ఆయన ఒక్క అడుగు ముందుగానే ఉనన్నారు. అలాగే కాంగ్రెస్ కూడా తమ అభ్యర్థిగా స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కావ్యను బరిలో దించింది. ఈ టికెట్ కోసం 42 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే కాంగ్రెస్ నేతలు దొమ్మాటి సాంబయ్య, శనిగపురం ఇందిరాలో ఒకరికి టికెట్ ఖారారవుతుందని అంతా భావించారు. అనుహ్యంగా బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖరారై, ప్రచారం చేసుకుంటున్న కడియం కావ్యను పార్టీలోకి ఆహ్వానించి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యేలతో పాటు ఇప్పటికే కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేసి నిరాశకు గురైనా ఆశావహులను కలిసి తనకు సహకారం అందించాలని కావ్య కోరుతున్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఈ పార్లమెంట్ స్థానం ఇన్‌చార్జిగా నియమించి, అసంతృప్తులను బుజ్జగించే పని అప్పగించారు. ఈనెల 6న తుక్కుగూడలో జరిగే బహిరంగ సభ అనంతరం ప్రచారాన్ని ముమ్మరం చేయాలని కాంగ్రెస్ నేతలు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

# తాడేపల్లి సిట్ కార్యాలయం వద్ద పత్రాల దహనం

**హెరిటేజ్ కీలక పత్రాలు ఉన్నయని టిడిపి ఆరోపణ**

**అమరావతి:** తాడేపల్లి సిట్ కార్యాలయం కాంపౌండ్‌లో పలు పత్రాలను సిబ్బంది దహనం చేశారు. ఇది అనుమానాలకు తావిస్తోంది. వీటిని తగలబెట్టడాన్ని పలువురు స్థానికులు ప్రశ్నించడంతో పాటు వీడియోలు తీశారు. ఆ వీడియోలను తమకు ఇవ్వాలని స్థానికులపై సీఐడీ ఒత్తిడి తెస్తోంది.సీఐడీ చీఫ్ రఘురామ్‌రెడ్డి ఆదేశాల మేరకు పత్రాలు తగలబెట్టినట్లు సిబ్బంది చెబుతున్నారు. హెరిటేజ్ సంస్థ కీలక పత్రాలు సహా ఇతర దస్త్రాలు అందులో ఉన్నట్లు తెదేపా నేతలు ఆరోపిస్తున్నారు. జగన్ ఆదేశాలతో చంద్రబాబును ఇబ్బంది పెట్టేందుకు సిట్ అక్రమ కేసులను పెట్టిందని చెప్పారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా వాంగ్మూలం కోసం సీఐడీ అనేక మందిపై ఒత్తిడి చేసిందని తెలిపారు. అనుమతులు లేకుండా పలు దస్త్రాలు ఎలా వచ్చాయని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇటీవల ప్రశ్నించారు. కేసుతో సంబంధం లేని పత్రాలు మీ చేతికి ఎలా వచ్చాయని నిలదీశారు. టిడిపి నేత లోకేష్‌ను విచారణ సమయంలో ప్రశ్నించిన పత్రాలపై అనాడే అడిగామని టిడిపి దేవినేని ఉమ మహేశ్వర్ రావు చెప్పారు. ఆ పత్రాలు ఎలా వచ్చాయో ఇంతవరకు సమాధానం చెప్పలేదని, సిఐడి చీఫ్ రఘురామ్‌రెడ్డి తప్పుడు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, పత్రాల దహనంపై సిఐడి చీఫ్ రఘురామ్‌రెడ్డి, డిజిపి సమాధానం చెప్పాలని నిలదీశారు. పత్రాల దహనంపై సిఇఒకు కూడా ఫిర్యాదు చేస్తామని దేవినేని ఘాటుగా హెచ్చరించారు. తాడేపల్లి సిట్ కార్యాలయం కాంపౌండ్‌లో పలు కాగితాలను సిబ్బంది దహనం చేశారు. సిట్ కార్యాలయ సిబ్బంది పలు పత్రాలు దహనం చేయడంపై అనుమానాలు ఉన్నాయని టిడిపి వాళ్లు ఆరోపణలు చేశారు. హెరిటేజ్ సంస్థకు చెందిన కాగితాలే తగలబెట్టి ఉంటారని టిడిపి వాళ్లు అనుమానం వ్యక్తం చేశారు. ఎవరి ఉత్తర్వులతో పత్రాలు తగలబెట్టారో డిజిపి చెప్పాలని టిడిపి వర్ల రామయ్య డిమాండ్ చేశారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికే పత్రాలు దహనం చేశారని, తప్పుడు పనులు చేసిన అధికారులను వదిలేది లేదని రామయ్య హెచ్చరించారు

. తాడేపల్లి సిట్ కార్యాలయం కాంపౌండ్‌లో పలు కాగితాలను సిబ్బంది దహనం చేశారు. సిట్ కార్యాలయ సిబ్బంది పలు పత్రాలు దహనం చేయడంపై అనుమానాలు ఉన్నాయని టిడిపి వాళ్లు ఆరోపణలు చేశారు. హెరిటేజ్ సంస్థకు చెందిన కాగితాలే తగలబెట్టి ఉంటారని టిడిపి వాళ్లు అనుమానం వ్యక్తం చేశారు.

# ప్రజాభవన్ వద్ద జరిగిన కారు ప్రమాదం కేసు

## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడి అరెస్ట్

**హైదరాబాద్:** ప్రజాభవన్ వద్ద జరిగిన కారు ప్రమాదం కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రజాభవన్ వద్ద జరిగిన ప్రమాదం తర్వాత షకీల్ కుమారుడు రహేల్ దుబాయ్ పారిపోయాడు. దీంతో ఆయనపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. ఇన్ని రోజుల తర్వాత దుబాయ్ నుంచి వచ్చిన రహేల్‌ను పోలీసులు శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్టు చేశారు.

గతేడాది డిసెంబర్ 23 అర్ధరాత్రిలో ప్రజాభవన్ వద్ద ప్రమాదం జరిగింది. బీఎండబ్ల్యూ కారుతో వచ్చిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ తనయుడు రహేల్ బారికేడ్లను తొక్కుకుంటూ వెళ్లిపోయాడు. కేసు నుంచి తప్పించుకోవడానికి తన స్థానంలో వేరే డ్రైవర్‌ను కూర్చోబెట్టాడు. కేసు రిజిస్టర్ చేసిన తర్వాత విచారిస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. స్థానికులను విచారించిన పోలీసులు సిసిటీవీ ఫుటేజ్ పరిశీలించారు. అనంతరం డ్రైవింగ్ చేసింది రహేల్ అని నిర్ధారించారు. అప్పటికే డ్రైవింగ్ సీటులో ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేసి పరీక్షలు చేశారు. కారు బీభత్సం సృష్టించిన తర్వాత అందులో ఓ వ్యక్తి పరారైనట్టు గుర్తించారు. ఈ ఎపిసోడ్‌లో పోలీసులతో ఎమ్మెల్యే అనుచరులు కుమ్మక్కై.. రహేల్‌ను తప్పించే ప్రయత్నం చేశారని ఆరోపణలు వచ్చాయి. ఆ దిశగా పోలీసులు కేసు విచారిస్తే... సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రమాదం జరిగిన వెంటనే అతను దుబాయ్ పారిపోయినట్టు గుర్తించారు. దీంతో పోలీసులు ఆయనపై లుక్‌అవుట్ నోటీసులు ఇష్యూ చేశారు. దీనిపై రహేల్ తరఫున న్యాయవాదులు కోర్టును సైతం ఆశ్రయించినా వారికి ఊరట లభించలేదు. ప్రమాదం జరిగిన తర్వాత రహేల్‌ను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అయితే అక్కడకు షకీల్ అనుచరులు వచ్చి అతన్ని తీసుకెళ్లిపోయారు.

ఈ కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించాలని పోలీసులపై కూడా చర్యలు తీసుకుంది ప్రభుత్వం. పంజాగుట్ట సీఐనీ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

# జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు: కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 08**



జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికి శుభాలు చేకూరాలని ఆకాంక్షించారు. తెలుగు నామాది నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు నింపాలని మనసారా కోరుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉగాది పండగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అభిలషించారు..

ప్రస్తుత శ్రీ క్రోధి నామ సంవత్సరంలో జిల్లా మరింత ప్రగతి సాధించాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖః సంతోషాలు, ఆనందోత్సాహాలతో జీవనాలు వెళ్లదీయాలని ఆకాంక్షించారు.

# సిఎం రేవంత్‌కు తప్పిన ముప్పు కాన్వాయ్‌లో పేలిన టైరు

**హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రమాదం తప్పింది. రేవంత్ కాన్వాయ్‌లోని ల్యాండ్ క్రూజర్ కారు టైర్ పంక్చర్ అయి ఒక్కసారిగా పేలింది. దీంతో కారు సడెన్‌గా ఆగిపోయింది. హైదరాబాద్ నుంచి కొడంగల్ వెళ్లే సమయంలో వికారాబాద్ జిల్లా మన్నెగూడా వద్ద ఈ ఘటన జరిగింది. టైర్ పేలడంతో అందరూ భయంతో ఉలిక్కిపడ్డారు. వెంటనే వాహనాల నుంచి బయటకు వచ్చారు. కాన్వాయ్‌లో వెళ్తున్న నాయకులకు ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పేలిన టైర్లు రిపేర్ చేయడంతో మళ్లీ కొడంగల్‌కు బయలు దేరారు.గతేడాది మార్చిలోనూ రేవంత్‌రెడ్డి ప్రయాణిస్తున్న కాన్వాయ్‌లో ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. రాజన్న సిరిసిల్ల జిల్లా రావుపేటలో రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న కారు.. అతివేగంగా వెళ్తూ అదుపుతప్పి

కాన్వాయ్‌లో ముందున్న కారును ఢీకొట్టింది. దీంతో వరుసగా ఆరు కార్లు ఒకదానికి ఒకటి గుద్దుకున్నాయి. అయితే ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. మొత్తం ఏడు కార్లు ధ్వంసమ య్యాయి. కాగా సీఎం రేవంత్ సోమవారం కొండగల్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలతో లోక్ సభ ఎన్నికలపై సన్నాహక సమానేశం నిర్వహించారు. ఎన్నికల్లో అనుచరించాల్సిన వ్యూహాలపై దిశానిర్ధేశర చేశారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్ మహబూబ్‌నగర్ పరిధిలోనే ఉండటంతో.. ప్రత్యేక దృష్టి చెప్పారు సీఎం.







# మెహందీ పెట్టుకుంటున్నారా.. ఎర్రగా పండేందుకు ఇలా చేయండి..

పండుగలు వచ్చాయంటే చాలు.. చాలా మంది మెహందీ పెట్టుకుంటారు. ఈ నేపథ్యంలోనే సంక్రాంతి పండుగకి మెహంది పెట్టుకున్నప్పుడు ఎర్రగా పండాలంటే ఏం చేయాలో తెలుసుకోండి. పండుగకి మెహందీ పెట్టుకుంటున్నారా.. ఎర్రగా పండేందుకు ఇలా చేయండి.. ప్రస్తుతం సంక్రాంతి టైమ్ వచ్చేసింది. పెళ్ళిళ్ళు, పండుగలు, శుభకార్యాల టైమ్‌లో మెహందీ పెట్టుకుంటే ఎర్రగా పండాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవన్నీ కూడా నేచురల్‌గా ఇంట్లోనే ఫాలో అవ్వొచ్చు.

ముందు క్లీన్ చేయడం.. మెహందీ వేసుకునే ముందు చేతులు శుభ్రంగా క్లీన్ చేయాలి. చేతులపై మురికి మొత్తం పోవాలి. తర్వాత మెహందీ పెట్టుకుంటే చక్కగా పండుతుంది. అందుకోసం ముందుగానే సబ్బు, హ్యాండ్‌వాష్‌తో చేతులని క్లీన్ చేయాలి.

మాయిశ్చరైజర్ వద్దు.. అదే విధంగా, చేతులు కడుకున్న తర్వాత మాయిశ్చరైజర్ వాడొద్దు. దీని వల్ల మాయిశ్చరైజర్స్‌లోని కెమికల్స్ మెహందీ ఎర్రగా పండకుండా చేస్తాయి. కాబట్టి, దీనిని అవాయిడ్ చేయండి.

ఆరనివ్వడం.. మెహందీని నార్మల్‌గా సహజంగానే ఆరనివ్వాలి. తడి హెన్నాపై ఎలాంటివి అప్లై చేయొద్దు. పెట్టుకున్నాక నార్మల్‌గా ఆరనివ్వండి.





నిమ్మరసం, పంచదార.. అదే విధంగా మెహందీని ఎర్రగా పండేలా చేయడంలో నిమ్మరసం, పంచదార బాగా హెల్ప్ చేస్తాయి. ఇందుకోసం ముందుగా నిమ్మరసం తీసుకుని అందులో పంచదార వేసి బాగా కలపాలి. ఇది ఆరిన మెహందీపై అప్లై చేయాలి. దీని వల్ల మంచి రంగు వస్తుంది.

లవంగాల పొగ.. లవంగాలు కూడా మెహందీ రంగుని మంచి బ్రైట్‌గా చేయడంలో హెల్ప్ చేస్తాయి. ఇందుకోసం ఓ పాన్ తీసుకుని లవంగాలు వేసి సిమ్‌లో పెట్టి ఫ్రై చేయాలి. పొగ వస్తున్నప్పుడు చేతుల పెట్టండి. ఆ పొగ మెహందీకి తగిలేలా చూడండి. దీని వల్ల మంచి రంగు వస్తుంది.

# గుడ్డుతో ఇలా మాస్క్ వేస్తే.. జుట్టు ఒత్తుగా పెరుగుతుంది..!





ఈ రోజుల్లో లైఫ్‌స్టైల్ మార్పులు, ఒత్తిడి, కాలుష్యం కారణంగా.. హెయిర్ సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. జుట్టు సమస్యలకు చెక్ పెట్టడానికి.. గుడ్డు ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. మీ హెయిర్ కేర్‌లో గుడ్డు ఎలా యాడ్ చేసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.

గుడ్డు పోషకాల స్టోర్‌హౌస్. గుడ్డులో అత్యవసరమైన 9 అమైనో యాసిడ్స్, ఫోలేట్, సెలీనియం, ఫాస్ఫరస్, విటమిన్ ఎ, విటమిన్ బి2, విటమిన్ బి5, విటమిన్ బి12, విటమిన్ డి, ప్రొటీన్ ఉంటాయి. అందుకే రోజూ గుడ్డు తినాలని నిపుణులు సూచిస్తూ ఉంటారు. గుడ్డు హెయిర్ కేర్‌లోననూ సహాయపడుతుంది. ఇందులోని బోలెడు పోషకాలు జుట్టుకు రక్షణను ఇస్తాయి. పచ్చసొన వెంట్రుకలకు మృదుత్వాన్ని ఇస్తే.. విటమిన్ ఎ, కె, బయోటిన్‌లు హెయిర్ గ్రోత్‌ను ప్రోత్సహిస్తుంది. మీ హెయిర్ కేర్‌లో గుడ్డును ఎలా యాడ్ చేసుకోవాలో ఈ స్టోరీలో చూసేయండి.

జుట్టు బాగా పెరగాలంటే.. మీకు హెయిర్ ఫాల్ ఎక్కువగా ఉంటే.. ఆ సమస్యకు చెక్ పెట్టడానికి గుడ్డు ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. హెయిర్ ఫాల్‌ను కంట్రోల్ చేయడానికి గిన్నెలో గుడ్డును పగలగొట్టాలి. దీంట్లో రెండు పెద్ద చెంచాల చొప్పున కొబ్బరి, ఆలివ్, పెద్ద చెంచా లావెండర్ నూనె వేసి బాగా మిక్స్ చేయాలి. దీన్ని మాడుకు పట్టించి ఇరవై నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తే జుట్టు చక్కగా పెరుగుతుంది. జుట్టు ఆరోగ్యంగా కూడా ఉంటుంది.

చుండ్రు సమస్య పోవాలంటే.. శీతాకాలంలో చుండ్రు సమస్య ఎక్కువగా ఉంటుంది. చుండ్రు సమస్యను దూరం చేయడానికి.. గుడ్డు ప్రభావవంతంగా పనిచేస్తుంది. గుడ్డును పచ్చతొనతో సహా తీసుకుని.. గిలకొట్టండి. దానిలో కొంచెం నిమ్మరసం వేయండి. దీన్ని తలకు అప్లై చేసి.. ఇరవై నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వతా మైల్డ్ షాంపూతో తలస్నానం చేయండి. ఇది జుట్టుని బలంగా మారుస్తుంది. చుండ్రునూ తగ్గిస్తుంది.

జుట్టుకు తేమనందించండి.. చలికాలంలో జుట్టు పొడిగా మారుతుంది. జుట్టుకు తేమనందించడానికి.. ఒక కోడిగుడ్డు మిశ్రమంలో కొద్దిగా ఆలివ్ నూనె వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు, కుదుళ్లకు పట్టించి 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వత మైల్డ్ షాంపూతో తలస్నానం చేయండి. ముఖ్యంగా గుడ్డులోని పచ్చసొన జుట్టుకు పటుత్వాన్ని అందించి దృఢంగా చేస్తుంది. అంతేకాదు, జుట్టుకు మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది.





పట్టులాంటి జుట్టు కోసం.. జుట్టు మృదువుగా, పట్టులా మార్చడానికి గుడ్డు సహాయపడుతుం ది. ఓ గుడ్డు కొట్టి దాంట్లో టేబుల్ స్పూన్ ఆవనూనె, రెండు చెంచాల కలబంద గుజ్జు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకి రాసి, గంట య్యాక తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తుంటే... జుట్టు రాలడం తగ్గుతుంది. మృదువుగా, సిల్కీగా, నిగారింపుతో కనిపిస్తుంది. శీతాకాలం లో ఎక్కువగా ఇబ్బంది పెట్టే సమస్యల్లో.. స్ప్లిట్ ఎండ్స్ ఒకటి. జుట్టు చిట్లిపోతే.. పచ్చసొనలో కొంచెం కొబ్బరినూనె, తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు పట్టించి మర్దనా చేయండి. తర్వాత తలస్నానం చేయండి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే.. జుట్టు బలంగా, మృదువుగా మారుతుంది. అలాగే జుట్టు చిట్లిపోయే సమస్య దూరమవుతుంది.







# పంచదార బదులు..



సంక్రాంతి పండుగ రానే వచ్చింది. ఈ టైమ్‌లో చాలా మంది పిండివంటలు, స్వీట్స్ చేసుకుంటారు. ఈ టైమ్‌లో స్వీట్స్ తయారు చేసేందుకు ఆర్గానిక్ బెల్లం వాడడం మంచిది. దీని వల్ల కలిగే లాభాలు ఏంటో తెలుసుకోండి. పండుగ వచ్చిందంటే చాలు.. ఇంట్లో చాలా మంది తియ్యని వంటలు చేస్తారు. వీటిని దేవునికి నైవేద్యంగా పెడతారు. అయితే, స్వీట్స్‌లో చాలా వరకూ పంచదార వేసే బదులు బెల్లం వాడుకోవచ్చు. దీని వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. అలాంటప్పుడు, తీపి వంటకాలు, స్నాక్స్ తయారు చేయాలంటే బెల్లం వాడాలి. ఎందుకంటే ఆరోగ్యానికి పంచదార కంటే బెల్లం మంచిది. ఇందులో ఆర్గానిక్ బెల్లం వాడడం మంచిది. .



ఇమ్యూనిటీ.. ఆర్గానిక్ బెల్లంలో జింక్, సెలీనియంలు పుష్కలంగా ఉంటాయి. పండుగల్లో తయారుచేసే వంటకాల్లో ఇలాంటి బెల్లం వాడితో ఇమ్యూనిటీ పెరుగుతుంది. దీని కారణంగా ఇన్ఫెక్షన్స్, వైరస్‌ల నుంచి మనల్ని మనం దూరం చేసుకోవచ్చు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ కారణంగా ఈ సమస్యలన్నీ దూరమవుతాయి. ఇందులో మినరల్స్, జింక్, సెలీనియంలు ఉంటుయి. ఇవన్నీ శరీరంలో మంటను కలిగించే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి ఆరోగ్యాన్ని కాపాడి ఇమ్యూనిటీని బలంగా చేస్తాయి.

జీర్ణ సమస్యలు దూరం.. ఈ బెల్లం తినడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. ముఖ్యంగా కడుపులోని జీర్ణ ఎంజైమ్స్ మెరుగ్గా అవుతాయి. ఎసిటిక్ యాసిడ్‌గా ఇవి మారతాయి. ఇవి జీర్ణ వ్యవస్థ సరిగ్గా జరిగేలా చూస్తాయి. అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు ఉన్నవారు ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో బెల్లం ముక్క వేసి పరగడపున తాగితే కడుపులోని మలినాలు బయటికి వెళ్ళిపోతాయి. దీని వల్ల మలబద్ధకం, జీర్ణ సమస్యలు దూరమవుతాయి.

ఐరన్ కంటెంట్.. ఆర్గానిక్ బెల్లంలో ఐరన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. అందుకే పండుగల టైమ్‌లో తయారు చేసే స్వీట్స్‌లో, పాలు, టీ, కాఫీల్లో పంచదార బదులు ఆర్గానిక్ బెల్లం వేసుకుని తాగితే శరీరానికి అవసరమైన ఐరన్ అందుతుంది.

# ఆహారంలో చేర్చుకుంటే.. గుండెకు కూడా మంచిదే..!





కాయెన్ పెప్పర్స్.. ఇది ఓ రకమైన ఘాటైన మిర్చీ. దీన్ని వంటకాలకు మంచి రుచిని, ఘూటును అందించడానికి వాడుతుంటారు. ఫ్రెంచ్ గయానాలోని కయెన్ నగరం పేరు మీద దీనికి పేరు పెట్టారు. ఈ రకం మిర్చీ పొడవుగా, పండిన తర్వాత మంచి ఎరుపు రంగులో, సన్నాగ ఉంటుంది. ఇవి ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయని నిపుణులు అంటున్నారు. ఈ మిర్చీలో క్యాప్సైసిన్ అనే సమ్మేళనం ఉంటుంది.

పెయిన్ కిల్లర్‌లా పనిచేస్తుంది.. కాయెన్ మిర్చీలో.. క్యాప్సైసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కొన్ని నరాల సంకేతాలను నిరోధించి.. నొప్పి సంచలనాలను తగ్గిస్తుందని తేలింది. ఇది తీసుకున్నప్పుడు.. క్యాప్సైసిన్ శరీరంలో నొప్పి గ్రాహకాలను బంధిస్తుంది. తద్వారా నొప్పిని త్వరగా తగ్గిస్తుంది.

జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. కాయెన్ మిర్చీ.. లాలాజలం, ఎంజైమ్‌లు, గ్యాస్ట్రిక్ జ్యూస్‌ల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. ఈ మిర్చీ.. జీర్ణక్రియకు సహాయపడుతుంది. వీటిలో చెడు బ్యాక్టీరియాతో పోరాడగల యాంటీమైక్రోబయల్ లక్షణాలు కూడా ఉంటాయి, తద్వారా జీర్ణ సమస్యలను నివారిస్తాయి.

బరువు తగ్గుతారు.. శరీర జీవక్రియను మెరుగుపరుస్తాయి, శరీరంలో కొవ్వును త్వరగా కరిగిస్తాయి. ఈ మిర్చీలోని క్యాప్సైసిన్ శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది, ఇది క్యాలరీలను త్వరగా కరిగిస్తుంది. మీ వెయిట్ లాస్ జర్నీకి సహాయపడుతుంది.

హృదయనాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది.. కాయెన్ మిర్చీ రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడానికి సహాయపడతాయి. తద్వారా గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. ఈ మీర్చీలోని పోషకాలు శరీరంలో రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. ఇది రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తుంది.



రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది.. కాయెన్ మిర్చీలో.. విటమిన్ సి కంటెంట్ అధికంగా ఉంటుంది. ఇది ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తుంది, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. జలుబు, ఫ్లూ, ఇతర శ్వాసకోశ సమస్యలు రాకుండా అడ్డుకుంటుంది.

అర్థరైటిస్ నొప్పిని తగ్గిస్తుంది.. కాయెన్ మిర్చీలోని నొప్పిని తగ్గించే గుణాలు.. కీళ్ల నొప్పులు, అర్థరైటిస్‌తో సంబంధం ఉన్న వాపు, నొప్పిని తగ్గించడానికి సహాయపడతాయి. నొప్పి సంకేతాలను ప్రసారం చేయడానికి బాధ్యత వహించే న్యూరోట్రాన్స్మిటర్ పదార్థాన్ని తగ్గించడానికి

క్యాన్సర్‌కు చెక్ పెడుతుంది.. కాయెన్ మిర్చీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ కారక ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి. ఊపిరితిత్తులు, ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్‌లు వచ్చే ముప్పును తగ్గిస్తుంది.

బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గిస్తుంది.. కాయెన్ మిర్చీ.. బ్లడ్ షుగర్ లెవ్లస్ తగ్గించడానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడానికి సహాయపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. డయాబెటిస్, ప్రీ డయాబెటిస్ ఉన్న వ్యక్తులు కాయెన్ మిర్చీ వారి డైట్‌లో తీసుకుంటే మేలు జరుగుతుంది. మిరియాల్లోని క్యాప్సైసిన్ కంటెంట్.. శ్లేష్మాన్ని తొలగిస్తుంది, సైనస్ డ్రైనేజీని ప్రోత్సహించి.. నాసికా రద్దీని క్లియర్ చేస్తుంది. సైనసిటిస్, అలెర్జీలు, జలుబు లక్షణాల నుంచి ఉపశమనం ఇవ్వడానికి ఈ మిర్చీ సహాయపడుతుంది.







# ఆరోగ్యంగా ఉండేందుకు మల్టీ విటమిన్స్..

మహిళలకి అనేక పనులు ఉంటాయి. దీంతో వారు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారు. అలా కాకుండా వారు ఆరోగ్యంగా ఉండేందుకు ట్యాబ్లెట్స్ హెల్ప్ చేస్తాయి. చిన్నతనం నుంచి వృద్ధాప్యం వరకూ మహిళలకి అనేక బాధ్యతలు ఉంటాయి.

డాక్టర్స్ ఏం చెబుతున్నారంటే..

స్త్రీల ఆరోగ్యం విషయంలో డైట్‌తో పాటు మల్టీవిటమిన్స్, సప్లిమెంట్స్ కీ రోల్ పోషిస్తాయి. ఏ వయసులోనైనా మహిళలైనా తగినంత పోషకాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవాలి. డాక్టర్ రక్షిత భూతాలే(కన్సల్టెంట్ అబ్‌స్టెట్రిషియన్, గైనకాలజిస్ట్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, కనెక్ట్ అండ్ హీల్) ముప్పై ఏళ్ళలోపు మహిళలకు మల్టీ విటమిన్స్ ఎందుకు ముఖ్యమో చెబుతున్నారు.

ఐరన్.. స్త్రీ శరీరంలో ఐరన్ కీ రోల్ పోషిస్తుంది. శరీరంలోని ఎన్నో విధులకి ఐరన్ చాలా ముఖ్యం. ఈ పోషకం లేకపోతే ఎర్ర రక్తకణాల ఉత్పత్తి తగ్గుతుంది. రక్తహీనత ఎదురవుతుంది. లివర్, మాంసం, ఆకుకూరలు, మిగతా ఫుడ్స్‌లో ఐరన్ పుష్కలంగా ఉన్నప్పటికీ, కొన్నిసందర్భాల్లో అదనపు మొత్తంలో స్త్రీలకు సప్లిమెంట్స్ అవసరం కావొచ్చు. టీనేజ్ నుంచి ఐరన్ ఎక్కువగా ఉన్న ఫుడ్స్ తీసుకోవడం చాలా ముఖ్యం. ఐరన్ లోపం వల్ల చాలా మంది మహిళల్లో రక్తహీనత, అలసటగా ఉంటుంది.

కాల్షియం.. ఎముకలు, దంతాలను ఆరోగ్యంగా ఉంచడంలో కాల్షియం కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఎముకల ఆరోగ్యానికి కాల్షియం చాలా ముఖ్యం. నిజానికీ రోజుకి 2 గ్లాసుల పాలు అవసరం. కానీ, బిజీ షెడ్యూల్, లైఫ్‌స్టైల్ కారణంగా పాలు తీసుకోకపోవడం, కాల్షియం అందకపోవడం జరుగుతుంది. విటమిన్ డి3 కాల్షియం శోషణలో హెల్ప్ చేస్తుంది.

విటమిన్ డి3.. తగినంత విటమిన్ డి 3 పొందని వారికి క్యాప్సూల్ రూపంలో దీనిని తీసుకోవచ్చు. విటమిన్ డి 3 ఇమ్యూనిటీ, ఎముకల ఆరోగ్యానికి హెల్ప్ చేస్తుంది. కండరాల బలం, ఆరోగ్యాన్ని కాపాడడంలో హెల్ప్ చేస్తుంది. ఇది కాల్షియం శోషణలో కూడా హెల్ప్ చేస్తుంది. మనకి సూర్యరశ్మి ఎక్కువగా ఉన్నప్పటికీ తగినంత విటమిన్ డి అందదు. ఆహారంలో విటమిన్ డి తీసుకోవడం కూడా తక్కువే. రోజుకి డి3 క్యాప్సూల్ తీసుకుంటే ఈ పోషకం కూడా అందుతుంది.

ఫిష్ ఆయిల్.. ఒమేగా 3.. గుండె, మెదడు, కంటి, నాడీ వ్యవస్థ, చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఫిష్ ఆయిల్ సప్లిమెంటేషన్ కోసం ట్రైయాసిల్‌గ్లిసరాల్, ట్రయాసిల్ గ్లిజరైడ్ రూపంలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉండే ఫిష్ ఆయిల్ సప్లిమెంట్స్ తీసుకోవడం మంచిది. ప్రతిరోజూ వీటిలో ఏదో ఒకటి తీసుకుంటే మంచిది. సముద్రపు చేపలని తినలేని వారు వారానికి కనీసం రెండు, మూడు సార్లు ఈ సప్లిమెంట్స్ తీసుకుంటే మంచిది.

ఫోలేట్.. కొత్త కణాలు, కణజాల నిర్మాణానికి నీటిలో కరిగి బి విటమిన్స్ చాలా ముఖ్యం. ఇది హెల్దీ రక్త కణాల ఉత్పత్తి, మెదడు పనితీరుకి మద్దతు ఇస్తుంది. ఇది పిండంలో న్యూరల్ ట్యూబ్ అసాధారణతలను నివారించడంలో హెల్ప్ చేస్తుంది. ఇది చాలా ముఖ్యమైన ప్రినేటల్ సప్లిమెంట్స్‌లో ఒకటి. మహిళలు రోజుకి 400 మైక్రోగ్రాముల ఫోలేట్ తీసుకోవాలి. గర్భిణీలకు చాలా మంచిది. యాంటీ ఆక్సిడెంట్ ఎంజైమ్. ఇది జీవక్రియ పనుల్లో చురుగ్గా ఉండే అవయవాల్లో ముఖ్యంగా గుండెలో ఉంటుంది. గుండె, రక్త నాళాల ఆరోగ్యాన్ని కాపాడి హృదయనాళ వ్యవస్థకి హెల్ప్ చేస్తుంది. ఆరోగ్యకరమైన రక్త కొవ్వులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. 10 స్థాయిలు సహజంగా వయసు కారణం తగ్గుతాయి.

# స్టిక్కర్స్ ఈజీగా తీయాలంటే..








గాజు సీసాలు, స్టీల్ గిన్నెలు, ప్లాస్టిక్ బాటిల్స్‌పై స్టిక్కర్లు, లేబుల్‌లు, కాస్ట్ ట్యాగ్‌లు తొలగించడం చాలా కష్టం. కొందరు గోర్లతో, కత్తులతో.. స్టిక్కర్స్ తీయడానికి ప్రయత్నిస్తుంటారు. కానీ, అవి సగం డబ్బా, ప్లేట్స్ పైనే మిగిలిపోతాయి. దాని జిగురు, మిగిలిన స్టిక్కర్ బాటిల్‌పైనే ఉండి చూడటానికి బాగుండదు. ఆ బాటిల్స్, గిన్నెలు ముట్టుకుంటే చేతికి అంటుకుంటాయి కూడా. ఇవి మీ కిచెన్ లుక్‌ను కూడా పాడు చేస్తాయి. మీరు గాజు సీసాలు, స్టీల్ గిన్నెలు, ప్లాస్టిక్ బాటిల్స్‌పై ఉన్న లేబుల్స్ సులభంగా తొలగించాలంటే.. కొన్ని టిప్స్ సహాయపడతాయి. అవేంటో చూసేయండి.

పిల్లలకి వారి హద్దులు గురించి ఇలా చెప్పండి

సబ్బు నీరు.. గాజు సీసాలు, స్టీల్ గిన్నెలు, ప్లాస్టిక్ బాటిల్స్‌పై లేబుల్స్ తీయడానికి సోప్ వాటర్ బాగా పనిచేస్తాయి. స్టిక్కర్స్ తీయడానికి.. ఒక బకెట్‌లో వేడి నీళ్లు పోసి, దానిలో కొన్ని చుక్కల లిక్విడ్ సేప్ వేసి స్టిక్కర్స్ ఉన్న బాటిల్స్, ప్లేట్లు నానబెట్టండి. ఆ తర్వాత స్టిక్కర్స్ శుభ్రం చేస్తే.. సులభంగా వచ్చేస్తాయి. ఇంకొక మార్గం కూడా ఉంది. మీరు సోప్ వాటర్‌ను డైరెక్ట్‌గా దానిపై పోసి కొంచెం సేపు ఉంచండి. ఇది జిగురును కరిగించి.. స్టిక్కర్ ఊడి వస్తుంది.

బేకింగ్ సోడా, ఆయిల్.. బేకింగ్ సోడా శక్తివంతమైన క్లీనింగ్ ఏజెంజ్. ఇది జిడ్డు, ధూళిని వదిలించడానికి ప్రభావవంతంగా పనిచేస్తుంది. బేకింగ్ సోడా, నూనెను సమాన మొత్తంలో కలపి..





లేబుల్‌పై అప్లై చేయండి. దీన్ని కొంచెం సేపు వదిలేసి.. స్క్రబ్ చేయండి. ఆ తర్వాత నీళ్లతో శుభ్రం చేయండి. ఇలా చేస్తే స్టిక్కర్ ఈజీగా ఊడి వస్తుంది. మీ హెయిర్ డ్రైయర్‌ను ఉపయోగించి కూడా గాజు సీసాలు, స్టీల్ గిన్నెలపై ఉన్న స్టిక్కర్స్, లేబుల్స్ తొలగించవచ్చు. హెయిర్ డ్రైయర్‌ను హై హీట్‌లో పెట్టి.. స్టిక్కర్ ఉన్నచోట కొంచెం సేపు పట్టుకోండి. ఈ వేడి కారణంగా.. లేబుల్‌కు ఉన్న జిగురు కరుగుతుంది. ఆ తర్వాత ఆ స్టిక్కర్‌ను తీస్తే సులభంగా వచ్చేస్తుంది. ఒకవేళ అది బయటకు రాకపోతే, లేబుల్‌ను కొన్ని సెకన్ల పాటు వేడి చేసి, ఆపై మళ్లీ ప్రయత్నించండి.

వైట్ వెనిగర్.. వైట్ వెనిగర్ అద్భుతమైన క్లీనింగ్ ఇంగ్రిడియంట్. ఒక బక్కెట్‌లో వేడి నీళ్లు పోసి దానిలో అరకప్పు వైట్ వెనిగర్ వేయండి. దానిలో స్టిక్కర్ తీయాల్సిన గాజు సీసాలు, స్టీల్ గిన్నెలు, ప్లాస్టిక్ బాటిల్స్ వేసి 30 నిమిషాల పాటు నానబెట్టండి. వైట్ వెనిగర్‌లోని ఎసిడిక్ గుణాలు.. స్టిక్కర్ సులభంగా ఊడేలా చేస్తాయి. మీ గిన్నెలు, ప్లేట్లకు మంచి మెరుపు కూడా వస్తుంది.

నెయిల్ పాలిష్ రిమూవర్‌తో.. నెయిల్ పాలిష్ రిమూవర్ వాడి కూడా మీరు డబ్బాలు, ప్లేట్లకు ఉన్న స్టిక్కర్స్ రిమూవ్ చేయవచ్చు. మీకు వీలైనంత వరకు లేబల్‌ను తొలగించండి. పూర్తయిన తర్వాత, కిచెన్ స్పాంజ్‌పై కొంత నెయిల్ పాలిష్ రిమూవర్ పోసి.. సున్నితంగా స్క్రబ్ చేయండి. దీన్ని గాజు, స్టీల్ పాత్రలకు మాత్రమే వాడండి. స్టీల్ గిన్నెలు, ప్లేట్లకు ఉన్న స్టిక్కర్లు సులభంగా తీయాలంటే.. గ్యాస్ మంటను సిమ్‌లో పెట్టి వాటిని వేడి చేయండి. దీంతో జిగురు వదులు అవుతుంది. ఆ తర్వాత మంచి ఆర్పి.. స్టిక్కర్ రిమూవ్ చేయండి. ఇలా చేస్తే.. స్కిక్కర్ సులభంగా ఊడుతుంది.



# ప్రభాస్ టైపే!

టాలీవుడ్ లో నాన్ వెజ్ ప్రియుడు ఎవరు అంటే అందరకీ తక్కున గుర్తొచ్చేది డార్లింగ్ ప్రభాస్. ముక్క లేనిదే ముద్ద దిగదు అని ఓపెన్ గానే చెప్పారు టాలీవుడ్ లో నాన్ వెజ్ ప్రియుడు ఎవరు అంటే అందరకీ తక్కున గుర్తొచ్చేది డార్లింగ్ ప్రభాస్. ముక్క లేనిదే ముద్ద దిగదు అని ఓపెన్ గానే చెప్పారు. డార్లింగ్ ఎక్కడికి వెళ్లినా వెంనటే సపరేట్ గా ఓ చెఫ్ ఉంటాడు. కావాల్సిన నాన్ వెజ్ వంటకాలు స్వయంగా వడ్డించుకుని తింటాడు. ఇలా చేయడం కేవలం ప్రభాస్ కి మాత్రమే సాధ్యం. ఆయన ఆరగించడమే కాకుండా తనచుట్టూ ఉన్నవాళ్లను సైతం నాన్ వెజ్ ఐటమ్స్ లో ముంచేయడం డార్లింగ్ ప్రత్యేకత. ఆ తర్వాత అంతగా నాన్ వెజ్ ని ఇష్టపడేది యంగ్ టైగర్ ఎన్టీఆర్. గ్రిల్డ్ చికెన్ గురించి ఓసారి తారక్ వివరించిన విధానంతోనే ఎంతలా నోరూరించాడో నెటి జనులందరికీ తెలిసిందే. అప్పుడే తారక్ నాన్ వెజ్ ని ఎంతగా ఇష్ట పడతాడు అన్నది అందరికీ తెలిసిందే. అలాగే చికెన్ బిర్యానీ ప్రియుడు కూడా. ఓ పెద్ద హండీ చికెన్ బిర్యానీ అమాంతాం లాగించేయగల సామర్థ్యం ఉన్నవారు ఒకప్పుడు. ఇలా వీరిద్దరి గురించి అందిరికీ తెలుసు. మరి విశ్వనటుడు కమల్ హాసన్ కూడా నాన్ వెజ్ ప్రియుడు అంటే మీరు నమ్ముతారా? అంటే నమ్మడం కష్టమే. 60 ఏళ్లు దాటినా చాక్లెట్ బోయ్ లా ఉంటాడు? అతను నాన్ వెజ్ ప్రియుడు ఏంటి? జోక్ చేస్తున్నారా? అనడం సహజం. కానీ నిజమేంటి అంటే కమల్ హాసన్ కూడా విపరీతమైన నాన్ వెజ్ ప్రియుడు అట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా రివీల్ చేసారు. భోజనంలో తప్పకుండా మాంసాహారం ఉండాల్సిందేనట. ముఖ్యంగా మధ్యాహ్నం అయితే చేప వంటకాలు తప్పనిసరిగా ఉండాలట. అందుకోసం ప్రత్యేకంగా ఓ చెఫ్ ని నియమించుకున్నారుట. కమల్ హాసన్ ఎక్కడ ఉంటే వెంట ఆ చెఫ్ కూడా ఉంటాడుట. అతడు అందుబాటులో ఉంటే ఫిష్ లోనే రకరకాల రుచులు ట్రై చేయిస్తారుట. ఒక్కో రోజు చికెన్ గ్రేవీ అందుబాటులో లేకపోతే కొబ్బరి చెట్నీ తో దోశ తింటారుట. ఉదయం మాత్రం వ్యాయామాలు ముగించుకుని ఓట్స్ తో పాటు పండ్లు తీసుకుంటారుట. అదే కమల్ బ్రేక్ పాస్ట్. సాయంత్రం తక్కువగా ఆహారం తీసుకుని త్వరగా నిద్రపోవడం అలవాటు. కొన్ని సంవత్సరాలుగా ఇదే విధానంలో ప్రయాణం సాగుతుందని తెలిపారు.



# ఆపితే మంచిది!

పక్కింటి అమ్మాయిగా ఇమేజ్ తెచ్చుకున్న ఈ బ్యూటీని సినిమాలో చూసి చాలా మంది అనుపమనేనా అని షాకయ్యారట టిల్లు స్క్వేర్.. ఈ సినిమా పేరు వింటేనే ఇప్పుడు అందరికీ అనుపమ పరమేశ్వరనే గుర్తుకొస్తుంది. అంతలా సినిమాలో తన గ్లామర్, యాక్టింగ్ తో ఆకట్టుకుందీ బ్యూటీ. గ్లామర్ గేట్లు ఎత్తేసి లిల్లీ రోల్ లో అదరగొట్టేసింది. ఆడియన్స్‌తో పాటు విమర్శకుల ప్రశంసలు కూడా దక్కించుకుంది. పక్కింటి అమ్మాయిగా ఇమేజ్ తెచ్చుకున్న ఈ బ్యూటీని సినిమాలో చూసి అనుపమనేనా అని షాకయ్యారట. కొందరు నెటిజన్లు.. అసలు సడెన్ గా బోల్డ్ రోల్ ను అనుపమ ఎందుకు ఎంచుకుందని తెగ ప్రశ్నించారు. నెట్టింట ట్రోల్స్ కూడా చేశారు. దీంతో హర్ట్ అయిన ఈ బ్యూటీ.. టిల్లు స్క్వేర్ కు చెందిన ఓ ఈవెంట్ కు కూడా హాజరు కాలేదు. కానీ మూవీ రిలీజయ్యాక మాత్రం అనుపమ.. పోస్ట్ ప్రమోషన్స్‌లో పాల్గొంటోంది. థియేటర్లకు వెళ్లి అభిమానుల తో సందడి చేస్తోంది. తెగ ఇంటర్వ్యూలు ఇస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో టిల్లు స్క్వేర్ లో గ్లామరస్ రోల్ చేసినందుకు తనపై వస్తున్న ట్రోల్స్ పై ఘాటుగా స్పందించింది అనుపమ. లిప్ లాక్ సీన్ లో నటించడాన్ని ఏదో పెద్ద తప్పు చేస్తున్నట్లు అంతా విమర్శిస్తున్నారని చెప్పింది. తాను 18 ఏళ్ల వయసులో కిస్ సీన్స్‌లో, గ్లామరస్ గా నటించనని చెప్పానని, ఇప్పుడు కాదని తెలిపింది. ఇండస్ట్రీలో ఇప్పుడు హీరోయిన్‌గా తాను చాలా పరిణితి చెందినట్లు క్లారిటీ ఇచ్చింది. ఏదైనా సినిమా స్టోరీకి అవసరం అయితే లిప్ లాక్ లాంటి సన్నివేశాల్లో నటించడం అస్సలు తప్పు కాదని తెలిపింది అనుపమ. ఒకే జోనర్ రోల్స్‌లో నటించడానికి బోరింగ్ గా ఉందని, అన్ని పాత్రలు చేయాలని చెప్పింది. సినిమా చూడకుండా కామెంట్స్ చేయడం కరెక్ట్ కాదని సూచించిం ది. ముందు థియేటర్లలో మూవీ చేసి అప్పుడు ప్రశంసించడమో, విమర్శించ డమో చేయండని ఫైర్ అయింది. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంది అనుపమ పరమేశ్వరన్. ఇటీవల మలయాళ మూవీ జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ డబ్బింగ్ పూర్తి చేసింది. కోర్టు రూమ్ డ్రామాగా రూపొందు తున్న ఈ సినిమా.. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాతోపాటు సౌత్‌లో మరిన్నిచిత్రాలు చేస్తోంది ఈ చిన్నది.

# విసుగు చెందని మెగా హీరో..!



ఇక అనిల్ రావిపుడి డైరెక్షన్‌లో వచ్చిన రెండు సినిమాలు వరుణ్ తేజ్ ఖాతాలో సక్సెస్ ఫుల్ సినిమాలుగా నిలిచాయి మెగా హీరోల్లో రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా ప్రయోగాలు చేస్తూ వస్తున్న మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ఫలితాలు ఎలా ఉన్నా కూడా తను చేయాలనుకున్న ప్రయత్నాల నుంచి వెనక్కి తగ్గట్లేదు. వరుణ్ తేజ్ నటించిన 13 సినిమాల మీద ఒక లుక్కేస్తే సినిమా సినిమాకు కొత్తగా ట్రై చేస్తూ వచ్చాడు. గద్దలకొండ గణేష్ తో తనలోని మాస్ యాంగిల్ చూపించిన వరుణ్ తేజ్ గని తో బాక్సర్ గా క్రేజీ అటెంప్ట్ చేసినా వర్క్ అవుట్ కాలేదు. ఇక అనిల్ రావిపుడి డైరెక్షన్ లో వచ్చిన రెండు సినిమాలు వరుణ్ తేజ్ ఖాతాలో సక్సెస్ ఫుల్ సినిమాలుగా నిలిచాయి. లాస్ట్ ఇయర్ గాంఢీవదారి అర్జున, ఈ ఇయర్ వచ్చిన ఆపరేషన్ వాలెంటైన్ రెండు సినిమాలు కూడా కమర్షియల్ గా వర్క్ అవుట్ అవుతాయని అనుకోగా అవి కాస్త తుస్సుమనిపించాయి. అయితే సినిమా ఫలితాలు తేడా కొడుతున్నా కూడా వరుణ్ తేజ్ తన ప్రయోగాలు చేసే విషయంలో రాజీ పడట్లేదు. ఆపరేషన్ వాలెంటైన్ సినిమా తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ అవ్వగా అంతకుముందు వచ్చిన ఫైటర్ ఎఫెక్ట్ దీని మీద పడటంతో సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ కాలేదు. సినిమా కథల వల్లనో లేక సరైన దర్శకుల ఎంపిక వల్లనో కానీ వరుణ్ తేజ్ ఎఫర్ట్ పెడుతున్నా కూడా సరైన సక్సెస్ అందుకోలేకపోతున్నాడు. ప్రస్తుతం వరుణ్ తేజ్ కరుణ కుమార్ డైరెక్షన్ లో మట్కా సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ ప్లానింగ్ ఉంది. అయితే ఈ సినిమా బడ్జెట్ విషయంలో దర్శక నిర్మాతల మధ్య చర్చలు జరుగుతున్నాయని టాక్. ఇదిలా ఉంటే వరుణ్ తేజ్ నెక్స్ట్ సినిమా డైరెక్టర్ కన్ఫర్మ్ అయినట్టు తెలుస్తుంది.మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ యువ దర్శకుడు మేర్లపాక గాంధీ డైరెక్షన్ లో సినిమా ఫిక్స్ చేసుకున్నాడని టాక్. వెంకటాద్రి ఎక్స్ ప్రెస్, ఎక్స్ ప్రెస్ రాజా సినిమాలతో సక్సెస్ అందుకున్న మేర్లపాక గాంధీ నానితో చేసిన కృష్ణార్జున యుద్ధం సినిమా వర్క్ అవుట్ కాలేదు. ఆ తర్వాత మ్యాస్ట్రో సినిమా డైరెక్ట్ చేసిన మేర్లపాక గాంధీ రెండేళ్ల క్రితం లైక్ షేర్ అండ్ సబ్ స్క్రైబ్ సినిమా చేశాడు. డైరెక్టర్ గా తన మార్క్ చాటుతున్న మేర్లపాక గాంధీ వరుణ్ తేజ్ కోసం అద్భుతమైన కథ సిద్ధం చేసినట్టు తెలుస్తుంది. ఈ సినిమా కథ ఏంటి ప్రొడ్యూసర్ ఎవరన్నది తెలియాల్సి ఉంది. వరుణ్ తేజ్ తో మేర్లపాక గాంధీ తన స్టైల్ లో ఎంటర్టైనింగ్ కథ చేస్తాడా లేదా వరుణ్ తేజ్ పంథాలో ఒక ఎక్స్ పెరిమెంట్ చేస్తాడా అన్నది తెలియాల్సి ఉంది. మేర్లపాక గాంధీ, వరుణ్ తేజ్ కాంబో మూవీ అనౌన్స్ మెంట్ త్వరలో రానుంది. మట్కాతో పాటుగా ఈ సినిమాను కూడా ఒకేసారి సెట్స్ మీదకు తీసుకెళ్లనున్నాడు వరుణ్.

# మురిసిపోతున్న అమ్మడు..!

మహేష్ బాబు ఆ సినిమాలో తన సిగ్నేచర్ స్టైల్ గా ఒక కన్నుతో చూస్తాడు. అఫ్కోర్స్ సినిమాలో రమణ పాత్ర లెఫ్ట్ ఐ కాస్త వీక్ అని గురూజీ చెప్పించాడు నేషనల్ క్రష్ రష్మిక ఏం చేసినా సరే అదో సెన్సేషనల్ అవుతుంది. లాస్ట్ ఇయర్ యానిమల్ తో బాలీవుడ్ లో బ్లాక్ బస్టర్ అందుకున్న అమ్మడు త్వరలో పుష్ప 2 తో మరో బిగ్గెస్ట్ హిట్ టార్గెట్ పెట్టుకుంది. ఆగష్టులో రిలీజ్ కాబోతున్న ఈ సినిమా గురించి పాన్ ఇండియా లెవెల్ లో ఆడియన్స్ అంతా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. లేటెస్ట్ గా పుష్ప 2 సినిమా నుంచి రష్మిక పోస్టర్ వదిలారు. శ్రీవల్లి కొత్త లుక్ కిరాక్ అనిపించింది. రష్మిక బర్త్ డే సందర్భంగా వదిలిన పోస్టర్ గుంటూరు కారం లో మహేష్ ని గుర్తు చేస్తుంది. మహేష్ బాబు ఆ సినిమాలో తన సిగ్నేచర్ స్టైల్ గా ఒక కన్నుతో చూస్తాడు. అఫ్కోర్స్ సినిమాలో రమణ పాత్ర లెఫ్ట్ ఐ కాస్త వీక్ అని గురూజీ చెప్పించాడు. సో మహేష్ అలా చేతిని కుడి కన్నుకి ఫోకస్ పెట్టి చూస్తాడు. అయితే పుష్ప 2 నుంచి వదిలిన రష్మిక పోస్టర్ కూడా అచ్చం అలానే ఉంది. రష్మిక ని గుంటూరు కారం లోని మహేష్ తో పోల్చుతున్నారు. ఈ పోలికపై స్పందించింది రష్మిక మందన్న. తనను మహేష్ స్టిల్ తో పోల్చడంపై ఓ నైక్ ఐల్ లైక్ దిస్ కోల్లేజ్ అంటూ ఆ పోస్టర్ పై స్పందించింది రష్మిక. రమణగాడితో శ్రీ వల్లి ని కలిపి చేసిన ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మహేష్ తో రష్మిక సరిలేరు నీకెవ్వరు సినిమా చేసింది. అనిల్ రావిపుడి డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా సూపర్ హిట్ అయ్యింది. తెలుగులో సూపర్ ఫాం కొనసాగిస్తున్న రష్మిక ఇప్పుడు బాలీవుడ్ లోనూ దూసుకెళ్తుంది. రష్మిక ఏదైనా సినిమాలో ఉంది అంటే రా ప్రాజెక్ట్ పై నెక్స్ట్ లెవెల్ క్రేజ్ ఏర్పడుతుంది. ఓ పక్క పాన్ ఇండియా రేంజ్ లో కమర్షియల్ సినిమాలు చేస్తూనే మరోపక్క ఫిమేల్ సెంట్రిక్ సినిమాలకు కూడా అమ్మడు సై అనేస్తుంది. ప్రస్తుతం రాహుల్ రవీంద్రన్ డైరెక్షన్ లో గర్ల్ ఫ్రెండ్ సినిమా చేస్తుంది రష్మిక. రీసెంట్ గా రిలీజైన గర్ల్ ఫ్రెండ్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ కూడా సూపర్ అనిపించుకున్నాయి. రాబోయే సినిమాలతో రష్మిక బాలీవుడ్ స్టార్స్ ని కూడా పక్కకు నెట్టేసి నేషనల్ వైడ్ గా టాప్ ప్లేస్ లో నిలిచేలా ఉందని చెప్పొచ్చు.



# ‘శబరి’తో వరలక్ష్మీ సిద్ధం



వరలక్ష్మీ శరత్ కుమార్‌కు తెలుగులో మంచి క్రేజ్ ఏర్పడిందన్న సంగతి తెలిసిందే. తమిళం నుంచి తెలుగులోకి వచ్చిన ఈ బ్యూటీకి ఇక్కడే ఎక్కువగా ఆఫర్లు వస్తున్నాయి. లేడీ విలన్‌గా వరలక్ష్మీ తన సత్తాను చాటుకుంటోంది. ఇక ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్టుతో ప్రేక్షకుల ముందుకు రానుంది.

వరలక్ష్మీ శరత్ కుమార్‌కు ఇప్పుడు తెలుగులో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మెగాస్టార్ చిరంజీవి వంటి వారు ప్రధానంగా వరలక్ష్మీ నటన గురించి స్టేజ్ మీద మాట్లాడతాడు. అదీ ఆమె రేంజ్. అలాంటి వరలక్ష్మీ ప్రధాన పాత్రలో నటించిన పాన్ ఇండియా సినిమా ‘శబరి’. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో ఈ చిత్రం రూపొందింది. మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల ఈ చిత్రాన్ని నిర్మించారు. మహర్షి కూండ్ల చిత్రాన్ని సమర్పించారు. అనిల్ కాట్జ్ దర్శకుడిగా పరిచయం కానున్నాడు. ఈ మూవీని మే 3న విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఈ మేరకు నిర్మాత మాట్లాడుతూ.. సరికొత్త కథాంశంతో తీసిన సినిమా అని చెప్పుకొచ్చాడు. కథ, కథనాలు ఎంతో కొత్తగా ఉంటాయని తెలిపాడు. స్ట్రాంగ్ ఎమోషనల్ థ్రిల్లర్ అని అన్నాడు. వరలక్ష్మీ శరత్ కుమార్‌తో సినిమా చేయడం సంతోషంగా ఉందని చెప్పుకొచ్చాడు. ఇప్పటి వరకు ఆమె నటించిన సినిమాలకు పూర్తి భిన్నంగా ఉంటుందని శబరి మీద అంచనాలు పెంచేశాడు. ముఖ్యంగా ఆమె నటన అద్భుతంగా ఉండబోతోందని ఊరించేశాడు. తెలుగు, తమిళ వెర్షన్స్ ఫస్ట్ కాపీ రెడీ అయ్యిందని తెలిపాడు. అవుట్ పుట్ పట్ల చాలా హ్యాపీగా ఉన్నామన్నాడు. సినిమా తమకు చాలా నచ్చిందని చెప్పుకొచ్చాడు. మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు సైతం పూర్తి అయ్యాయని పేర్కొన్నాడు. ‘వరల్డ్ ఆఫ్ శబరి’ పేరుతో విడుదల చేసిన వీడియోకి మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. మే 3న పాన్ ఇండియా రిలీజ్ చేస్తున్నారు. అన్ని భాషలు, అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిదని మేకర్లు ఎంతో నమ్మకంగా ఉన్నారు.

# గుండుతో క్లీంకార..
## ఏనుగుకి స్నానం చేయిస్తున్న చరణ్



రామ్ చరణ్ ఉపాసన రైమ్ క్లీంకార థాయ్‌లాండ్‌లో బాగానే ఎంజాయ్ చేశారు. ఇక రైమ్ గాడి అకౌంట్ నుంచి కొన్ని ఫోటోలు బయటకు వచ్చింది. థాంక్యూ నాన్నా.. మంచి వెకేషన్‌కు తీసుకెళ్లినందుకు అంటూ రైమ్ గాడు పోస్ట్ చేసినట్టుగా కనిపిస్తోంది. రామ్ చరణ్ ఉపాసనలు బ్యాంకాక్, థాయ్‌లాండ్ వెకేషన్‌ల నుంచి వచ్చేశారు. గత ఆరేడు రోజులుగా వెకేషన్‌ను బాగానే ఎంజాయ్ చేశారు. శనివారం నాడు రామ్ చరణ్ ఫ్యామిలీ వెకేషన్ నుంచి వచ్చేసింది. అయితే ఈ వెకేషన్ గురించి రైమ్ ఇన్ స్టా ఖాతా నుంచి కొన్ని ఫోటోలు బయటకు వచ్చాయి. ఇక రైమ్ గాడు రామ్ చరణ్ గురించి, ఈ వెకేషన్ గురించి పోస్ట్ చేశాడు. థాంక్యూ నాన్నా.. మంచి వెకేషన్‌కు తీసుకెళ్లావ్.. నా చెల్లితో కలిసి వెకేషన్‌ను బాగా ఎంజాయ్ చేశా.. సముద్రంలో ఈత కొట్టా.. ఏనుగుల్ని ఎలా సంరక్షించాలో చూశా అంటూ ఇలా పోస్ట్ వేశాడు.



రైమ్ అకౌంట్ నుంచి వచ్చిన ఈ ఫోటోలను ఉపాసన కూడా షేర్ చేసింది. బెస్ట్ డాడీ అంటూ రామ్ చరణ్ మీద ప్రశంసలు కురిపించింది. ఇక ఈ ఫోటోల్లో క్లీంకార గుండుతో కనిపించింది. ఏనుగు పిల్లకు రామ్ చరణ్ స్నానం చేయిస్తున్న ఫోటో ఉంది. రైమ్ ఎంచక్కా ఈత కొడుతూ ఫుల్ చిల్ అవుతున్నట్టుగా కనిపిస్తోంది. రైమ్ పోస్టుకు మెగా ఫ్యాన్స్ ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు. రైమ్ గాడి పనే బాగుంది అంటూ ఒకరు.. పెట్టి పుట్టావ్ రా అని ఇంకొకరు.. ఇలా రకరకాలుగా కామెంట్లు చేస్తున్నారు. అసలే రైమ్ గాడికి నెట్టింట్లో ఫుల్ ఫాలోయింగ్ ఉంటుంది. హీరోయిన్లు సైతం రైమ్ గాడిని ముద్దాడుతుంటారు. రైమ్ ఎక్కడైనా కనిపిస్తే.. కెమెరాలన్నీ క్లిక్‌మనిపించాల్సిందే. రామ్ చరణ్‌తో పాటు రైమ్ ఉంటుంది. రైమ్ ఉంటే అక్కడ రామ్ చరణ్ ఉండాల్సిందే. ఇప్పుడు అయితే రామ్ చరణ్ చేతిలో రైమ్ ఉంటే.. ఉపాసన చేతిలో క్లీంకార ఉంటుంది. అలా ఇద్దరినీ ఎత్తుకుని వెకేషన్‌లో ఎంజాయ్ చేస్తున్నారు రామ్ చరణ్, ఉపాసన.

# సినిమా ఫిక్స్ అయినట్టే!



టిల్లు స్క్వేర్ వంద కోట్లు దాటడంతో హరీష్ శంకర్ స్పందించాడు. డిజే టిల్లు, మ్యాడ్, సర్, టిల్లు స్క్వేర్ ఇలా వరుసగా మంచి చిత్రాలను తీస్తూ నిర్మాత నాగవంశీ తన సత్తాను చాటుకుంటున్నాడని ప్రశంసించాడు హరీష్ శంకర్. దీనిపై నాగవంశీ స్పందించాడు. ఓ సినిమా మాకు చేసి పెట్టండి అని హరీష్ శంకర్‌ని అడిగేశాడు. అలా ఈ ఇద్దరి మధ్య ముచ్చట్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. నాగవంశీ, హరీష్ శంకర్ ట్వీట్లు, వారు పెట్టిన ముచ్చట్లు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. టిల్లు స్క్వర్ వంద కోట్లకు పైగా గ్రాస్ సాధించింది. ఇంకా బాక్సాఫీస్ వద్ద టిల్లు గాడు దుమ్ములేపేస్తున్నాడు. అయితే నాగ వంశీ మీద హరీష్ శంకర్ ప్రశంసలు కురిపిస్తూ వేసిన ట్వీట్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. డీజే టిల్లు, మ్యాడ్, సర్, టిల్లు స్క్వేర్ ఇలా వరుసగా సినిమాలు తీసి అందరినీ ఆకట్టుకుంటున్నాడు.. యంగ్ ప్రొడ్యూసర్‌గా నాగవంశీ తన అభిరుచిని చాటుతూ దూసుకుపోతోన్నాడని ప్రశంసించాడు. ఈ ప్రశంసల మీద నాగవంశీ స్పందించాడు.



మేం ఎప్పుడూ కూడా థియేటర్లో మంచి ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చే సినిమాలను తీయాలని ప్రయత్నిస్తుంటాం.. లక్కీగా అవి అందరికీ నచ్చుతున్నాయి.. మీరు ఇచ్చిన ప్రశంసలకు థాంక్స్.. ఇవన్నీ పక్కన పెడితే.. మీరు మాత్రం మాకు ఇంకా సినిమా చేయడం లేదు అని నాగవంశీ ట్వీట్ వేశాడు. దీనికి హరీష్ శంకర్ రిప్లై ఇచ్చాడు. మీ మాటలెంతో బాగున్నాయి.. అయినా మీరు సినిమాను ఇప్పుడే ప్రకటించేసేయండి.. మీతో పాటు ప్రెస్ మీట్‌లో కూర్చోవాలని నేను కూడా వెయిట్ చేస్తున్నాను అని హరీష్ శంకర్ అన్నాడు. ఈ ట్వీట్‌కు నాగవంశీ మళ్లీ రిప్లై ఇచ్చాడు. మీరు చెప్పాక.. ఇక కన్ఫామ్ సర్.. నెక్ట్స్ ఇంక ప్రెస్ మీటే అని నవ్వేశాడు. మొత్తానికి సితార బ్యానర్లో హరీష్ శంకర్ సినిమా ఇలా ట్వీట్లతో కన్ఫామ్ అయిపోయిందన్న మాట. మరి ఈ సినిమాకు కథ ఏంటి? హీరో హీరోయిన్లు ఎవరు? అన్నది తేలాల్సి ఉంది.

# రెండేళ్ల క్రితమే చెప్పిన సిద్ధూ



మార్చి 29న థియేటర్లలో రిలీజైన టిల్లు స్క్వేర్ సినిమా తాజాగా అదిరిపోయే రికార్డ్ కొట్టేసింది. సిద్ధు జొన్నలగడ్డ- అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన ఈ చిత్రం తాజాగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన ఈ క్రైమ్ కామెడీకి ఆడియన్స్ ఫిదా అయిపోయారు. ఈ సినిమా ఇప్పటివరకూ బాక్సాఫీస్ దగ్గర రూ.101.4 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిట్లు మూవీ టీమ్ తాజాగా పోస్టర్ రిలీజ్ చేసింది. ప్రస్తుతం పెద్ద సినిమాలేమీ లేకపోవడంతో టిల్లు గాడు ఇంకొన్ని రోజులు దుమ్ముదులిపేసేలా ఉన్నాడు. అయితే ఈ పోస్టర్‌పై మూవీ టీమ్ ఓ ఇంట్రెస్టింగ్ కామెంట్ కూడా పెట్టింది. “రాబోయే మూడేళ్లలో రూ.100 కోట్లు కొల్లగొట్టే సినిమా నేను చేయాలి” అంటూ 2022లో సిద్ధూ జొన్నలగడ్డ చేసిన కామెంట్‌ను ఈ పోస్టర్‌పై వేసింది మూవీ టీమ్. ఇక ఈ చిత్రం రూ.100 కోట్లు సాధిస్తుందని మూవీ నిర్మాత నాగ వంశీ కూడా ముందే చెప్పారు. తొలి రోజు రూ. 25 కోట్లు కలెక్షన్స్ సాధించి ఓవరాల్‌గా రూ.100 కోట్లకి పైగా వసూళ్లు సాధిస్తుందని నాగ వంశీ సినిమా రిలీజ్ అయ్యే ముందే అంచన వేశారు. ఇక ఈ సినిమాలో నేహా శెట్టి కేమియో రోల్‌లో కనిపించింది. ప్రిన్స్ సెసిల్, మురళీధర్ గౌడ్, మురళీ శర్మ, ప్రణీత్ రెడ్డి సహా పలురు కీలక పాత్రల్లో నటించారు. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సహకారంతో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను నిర్మించింది. రామ్ మిరియాల, అచ్చు రాజమణి, భీమ్స్ సిసిరోలియో ఇచ్చిన మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాని ఓ ఊపు ఊపేశాయి. ఈ చిత్రంపై తాజాగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా ప్రశంసలు కురిపించారు. ఇంతటి అద్భుత విజయం సాధించిన సిద్ధూ జొన్నలగడ్డ, అనుపమ సహా మూవీ టీమ్‌ను అభినందిస్తూ ట్వీట్ చేశారు. అంతకుముందు ఈ సినిమాపై మెగాస్టార్ చిరంజీవి కూడా రియాక్ట్ అయ్యారు. టిల్లు స్క్వేర్ సినిమాను ఆద్యంతం ఎంజాయ్ చేశానని, చాలా ఫన్నీగా తెరకెక్కించారంటూ మూవీ టీమ్‌ను అభినందించారు. ఇలాంటి సినిమాలు మరిన్ని రావాలని చిరు ఆకాంక్షించారు. ఇక ఈ సినిమా సక్సెస్ మీట్‌ను సోమవారం నిర్వహించనున్నారు. దీనికి యంగ్ టైగర్ ఎన్టీఆర్ స్పెషల్ గెస్ట్‌గా రాబోతున్నారు. సక్సెస్ మీట్‌కి ముందే సినిమా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరడంతో మూవీ టీమ్ ఫుల్ ఖుషీగా ఉంది.



# ఇక బ్లాక్ బస్టర్ అయినట్టే

శశివదనే సినిమా గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఎక్కువగా ట్రెండ్ అవుతోంది. శశివదనే మ్యూజిక్, పాటలు, గ్లింప్స్, టీజర్ ఇవన్నీ కూడా గుండెను హత్తుకునేలా ఉన్నాయి. ఇక ఈ మూవీ పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. చివరకు ఈ మూవీ మైత్రీ చేతికి వెళ్లింది. మైత్రీ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేసే సినిమాలు ఈ మధ్య ఎంతలా హిట్ అవుతున్నాయో అందరికీ తెలిసిందే. మైత్రీ విడుదల చేసే చిత్రాలకు అంతగా థియేటర్లు దొరక్కపోయినా కూడా కలెక్షన్స్‌లో మాత్రం సంచలనాలు సృష్టిస్తున్నాయి. హనుమాన్ మూవీ అందరినీ ఆశ్చర్యపరించింది. ఎన్నో క్లిష్ట పరిస్థితుల మధ్య మైత్రీ ఆ హనుమాన్ సినిమాను రిలీజ్ చేసి సక్సెస్ అయింది. పృథ్వీరాజ్ సుకుమారన్ గోట్ లైఫ్ సినిమాను డిస్ట్రిబ్యూట్ సక్సెస్ అయింది. ఇక రీసెంట్‌గా మంజుమ్మల్ బాయ్స్‌తోనూ మైత్రీ హిట్టు కొట్టేసింది. ఇలా మైత్రీ చేయి వేసిన ప్రతీ ప్రాజెక్ట్ బాక్సాఫీస్ వద్ద హిట్ అవుతోంది.